వైసిపి జిల్లా అధ్యక్షునిగా ముదునూరి

నరసాపురం: వైసిపి జిల్లా అధ్యక్షులుగా మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజును నియమిస్తూ వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి పార్టీ కేంద్ర కార్యాలయం ద్వారా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ తొలినాళ్ల నుంచి సేవలందిస్తూ, రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి విధేయుడిగా ఉన్న ప్రసాదరాజును మరో మారు పార్టీ జిల్లా అధ్యక్షులుగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా, ఏ బాధ్యత అప్పగించినా సమర్ధవంతంగా నిర్వర్తించే వ్యక్తిగా ముదునూరికి జిల్లాలో మంచి పేరే ఉంది. పార్టీని బలోపేతం చేస్తూ అందరినీ కలుపుకొని నడిపించగలిగిన వ్యక్తిగా ముదునూరి అంకితభావంతో పనిచేస్తారని జిల్లాలో వైసిపి మాజీ ఎంఎల్‌ఎలు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి మరోసారి వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు ముదునూరి జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పంట నష్టం @ రూ.16 కోట్లు..!

రెండు జిల్లాల్లో 16,030 ఎకరాల్లో పంటలకు దెబ్బ
ఏలూరు జిల్లాలో 7,484, పశ్చిమలో 8,546 ఎకరాలు
ప్రభుత్వానికి నివేదికలు పంపిన వ్యవసాయాధికారులు
జులైలో వరదలకు 13,307 ఎకరాల్లో రూ.11 కోట్ల పంటనష్టం
కోలుకోలేని స్థితిలోకి అన్నదాత
ఇ-క్రాప్‌లో ఉంటేనే కౌలురైతుల పేర్లు నమోదు



నూజివీడులో పెదచెరువుకు గండిపడడంతో దెబ్బతిన్న పంటపొలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వరదలకు దెబ్బతిన్న పంటనష్టం లెక్కలను అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మొత్తం 16,030 ఎకరాల్లో పంటనష్టం జరగ్గా ఎకరాకు రూ.పది వేలు చొప్పున రూ.16 కోట్లు నష్టపరిహారంగా రైతులకు అందించాలని లెక్క తేలింది. పంటనష్టం నమోదులో పూరిస్థాయిలో కౌలురైతుల పేర్లు నమోదు కాకపోవడంపై రైతుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జులైలో, సెప్టెంబర్ మొదటివారంలో రెండుసార్లు వరదలు విరుచుకుపడ్డాయి. వరదలకు రెండు జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటీవల ముంచెత్తిన వరదలకు పశ్చిమగోదావరి జిల్లాలో 8,546 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.పది వేలు చొప్పున రూ.8.55 కోట్లు పరిహారం రైతులకు అందించాల్సి ఉందని లెక్కలుగట్టారు. ఏలూరు జిల్లాలో 18 మండలాల్లో వరి, మినుము, పత్తి, పెసర, వేరుశెనగ, చెరకు, మొక్కజొన్న పంటలు మొత్తంగా 7,484 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అత్యధికంగా 5,639 ఎకరాల్లో వరిపంట, 1,602 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలకు సంబంధించి రూ.7.48 కోట్లు పంట నష్టపరిహారంగా రైతులకు అందించాల్సి ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకూ రెండుసార్లు వరదలు, భారీవర్షాలు దెబ్బతీశాయి. జులైలో వరదలకు పశ్చిమగోదావరి జిల్లాలో 12,957 ఎకరాల్లో వరి దెబ్బతినగా రూ. పది కోట్లు నష్టపరిహారం రైతులకు అందించాలని అధికారులు తేల్చారు. ఏలూరు జిల్లాలో 350 ఎకరాల్లో పంట నష్టపోగా రూ.కోటి వరకూ నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి నివేదించారు. రెండుసార్లు ముంచెత్తిన వరదలకు రెండు జిల్లాల్లో 29,337 ఎకరాల్లో రైతులు పంటను కోల్పోయారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకూ రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం సొమ్మును ఎకరాకు రూ.6,800 నుంచి రూ. పది వేలకు పెంచడం కొంత ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు. పంటనష్టం లెక్కలు తేలిపోవడంతో పరిహారం సొమ్ము ఎప్పటికి చెల్లిస్తారో వేచిచూడాలి.

ఇ-క్రాప్‌లో ఉంటేనే కౌలురైతుల పేర్లు నమోదు

పంటనష్టం నమోదులో సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లే నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా సాగుతుందని కౌలురైతులు గగ్గోలు పెడుతున్నారు. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. ఇందులో సగం మందికి కూడా ప్రభుత్వం కౌలుకార్డులు జారీచేయలేదు. కౌలుకార్డులు అందుకున్న రైతుల పేర్లు మాత్రమే ఇ-క్రాప్‌లో నమోదయ్యాయి. పంటనష్ట నమోదు ఇ-క్రాప్ ఆధారంగానే అధికారులు పూర్తిచేశారు. ఇ-క్రాప్‌లో పేర్లు లేని కౌలురైతుల వివరాలు పంట నష్టపరిహారం జాబితాలో చేరలేదని రైతులు చెబుతున్నారు. కౌలుకార్డు లేని కౌలురైతుల పేర్లు నమోదు చేస్తే భూయజమానులు వ్యవసాయ అధికారులపై ఘర్షణలకు దిగినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఇ-క్రాప్ ఆధారంగానే పంటనష్టం నమోదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో పంట నష్టపోయిన వాస్తవ సాగుదారులకు పరిహారం అందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కౌలురైతుల నుంచి తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త మద్యం పాలసీ షురూ..!

నూతన మద్యం పాలసీకి కేబినెట్ ఆమోదం
టెండర్ల ప్రక్రియ ద్వారా దుకాణాల కేటాయింపు
ప్రస్తుతం రెండు జిల్లాల్లో 270 మద్యం దుకాణాలు
కొత్త పాలసీలో 300కుపైగా దుకాణాలు పెరిగే అవకాశం
క్వార్టర్ కనిష్ట ధర రూ.90 ఉండేలా నిర్ణయం
గౌడ సామాజిక తరగతికి 10 శాతం దుకాణాల కేటాయింపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నూతన మద్యం పాలసీ అమలుకు రాష్ట్ర కేబినెట్ బుధవారం ఆమోద ముద్ర వేసింది. గత ప్రభుత్వ మద్యం పాలసీలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని, దాన్ని రద్దు చేస్తూ కొత్త పాలసీని తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. వైసిపి హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపింది. ఏలూరు జిల్లాలో 151, పశ్చిమగోదావరిలో 119 మొత్తం 270 మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్వహించింది. మద్యం ధరలను భారీగా పెంచి అమ్మకాలు సాగించింది. క్వార్టర్ మద్యం ధర కనిష్టంగా రూ.130 నుంచి అత్యధికంగా రూ.660 వరకు అమ్మకాలు సాగించింది. దీనిపై మందుబాబుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అంతేకాకుండా నాణ్యమైన మద్యం విక్రయించకుండా నాసిరకం మద్యం విక్రయించడంతో ఎంతోమంది రోగాల పాలయ్యారనే విమర్శలు విన్పించాయి. దీంతో తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందుబాటులోకి తేవడంతోపాటు ధరలు తగ్గిస్తామని కూటమి హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొస్తోంది.

టెండర్ల విధానంలో దుకాణాల కేటాయింపు..!

నూతన మద్యం విధానంలో టెండర్ల ప్రక్రియ ద్వారా దుకాణాలు కేటాయించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. టెండర్ల ప్రక్రియను లాటరీ పద్ధతిలో నిర్వహించనున్నారు. దుకాణాలు పొందాలనుకునేవారు పూచీకత్తు కింద రెండు లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ సొమ్మును తిరిగి చెల్లించడం ఉండదు. ప్రస్తుతం రెండు జిల్లాల్లో 271 మద్యం దుకాణాలు ఉండగా కొత్త పాలసీలో ఈ సంఖ్య 300 దాటే అవకాశం కన్పిస్తోంది. గతంలో టెండర్ ప్రక్రియ ద్వారా మద్యం విధానం నడిచినప్పుడు ఉమ్మడి జిల్లాలో 473 మద్యం దుకాణాలు ఉండేవి. ఇప్పుడు కూడా అదేస్థాయిలో జిల్లాలవారీగా దుకాణాలు ఉండే అవకాశం నెలకొంది. నూతన మద్యం విధానంలో క్వార్టర్ మద్యం ధర కనిష్టంగా రూ.90 ఉండేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

గౌడ సామాజిక తరగతికి పది శాతం దుకాణాలు..!

నూతన మద్యం పాలసీలో దుకాణాల కేటాయింపులో పది శాతం దుకాణాలను గౌడ సామాజిక తరగతికి కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

బెల్ట్ షాపులు పెరిగే అవకాశం

నూతన మద్యం విధానంతో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా పెరిగే అవకాశం కన్పిస్తోంది. దుకాణాలు దక్కించుకున్న వారు మద్యం అమ్మకాలు పెంచుకునేందుకు గ్రామగ్రామాన బెల్ట్ షాపులను ప్రోత్సహించే అవకాశం ఉంది. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వంలో బెల్ట్‌షాపులు విపరీతంగా కొనసాగాయని విమర్శలు వెల్లువెత్తాయి. నూతన మద్యం పాలసీ అమలుతో మరోసారి బెల్ట్‌షాపులు పెరిగే అవకాశం ఉంది. బెల్ట్ షాపులను ఏ విధంగా అరికడతారో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది.

వాలంటీర్లపై చర్చ..!

వాలంటీర్ల కొనసాగింపుపై మంత్రి మండలిలో చర్చ సాగింది. దీంతో వాలంటీర్లలో కొత్త ఆశలు చిగురించాయి. వాలంటీర్ వ్యవస్థ పునరుద్ధరించి తమకు ఉపాధి కల్పించాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఏ విధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

ఏచూరి, ఆర్ఎస్ మృతి తీరని లోటు

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, కమ్యూనిస్టు జిల్లా ఉద్యమ నేత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మృతి కార్మికవర్గానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఒకే నెలలో అసమానతలు లేని సమాజం కోసం పని చేస్తున్న గొప్ప పోరాట యోధులను కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరంలో సిఐటియు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడారు. ఏచూరి, ఆర్ఎస్ జీవితాలు నేటి యువత, కార్మిక వర్గానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశంలో అందరి మన్ననలు పొందిన నాయకుడు సీతారాం ఏచూరి అని అన్నారు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని విస్తరింపజేయడంలో శత్రువుల ఆటంకాలు ఎదిరించి ఆర్ఎస్ ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో ఆర్ఎస్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, డి.నాగేశ్వరరావు, గోపాలం, రామకృష్ణ పాల్గొన్నారు.

ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు కార్మికులు

తాడేపల్లిగూడెం: జిల్లాలో సిపిఎం బలోపేతానికి రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) చేసిన పోరాటాలు మరువలేనివని సిపిఎం మండల నాయకులు కండెల్లి సోమరాజు అన్నారు. ఇటుకలగుంటలో మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ జిల్లాలో సిపిఎం బలోపేతానికి చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో పాలుపూరి సత్యవతి, మల్లిపూడి సీతామహాలక్ష్మి, మాగంటి వెంకటరమణ, పాశం వీరమణి, పి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఏచూరి జీవితం స్ఫూర్తిదాయకం

ఎస్ఎఫ్ఐ పూర్వపు జిల్లా కార్యదర్శి మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

సీతారాం ఏచూరి జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని ఎస్ఎఫ్ఐ పూర్వపు జిల్లా కార్యదర్శి మంతెన సీతారాం అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. ఈ సభకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా మంతెన సీతారాం, పూర్వపు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఏచూరి తన ప్రజాజీవితాన్ని ఎస్ఎఫ్ఐలో చురుకైన నాయకుడిగా ప్రారంభించారన్నారు. జెఎన్‌యు విద్యార్థుల్లో అత్యంత ప్రజాదరణ పొంది శక్తివంతమైన నాయకుల్లో ఒకరిగా ఎదిగారన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటంలో జెఎన్‌యు విద్యార్థులను సమీకరించడంలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. ప్రజా పోరాటాలకు మానవ విలువలకు దిక్సూచిగా ఉంటుందని, అలుపెరగని పోరాట స్ఫూర్తి సీతారాం అని అన్నారు. పూర్వపు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ దేశం ప్రజాస్వామ్యం, లౌకిక ఆదర్శాల కోసం పోరాటాల్లో ఏచూరి ఎల్లప్పుడూ ముందంజలో ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు పి.వాసు, ముఖ్య నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ పూర్వపు జిల్లా కార్యదర్శి సీతారాం

లింగం కవికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని నవుడూరు గ్రామానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, ప్రయోక్త, రంగస్థల న్యాయనిర్ణేత లింగం సత్యనారాయణను తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆల్ ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వారు ఈ నెల 16న గురుబ్రహ్మ జాతీయస్థాయి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సత్యనారాయణ సిపిఎంలో పని చేస్తూ నాటక రంగానికి సేవలందిస్తున్నారు. ఈయన బొట్టుపెట్టు, సంఘసేవ, కళ్యాణ తిలకం, భగత్‌సింగ్ వంటి అనేక అభ్యుదయ భావాలు కలిగిన నాటకాలను రచించడమే కాకుండా నటునిగా మెప్పించారు. సుమారు నలభై రంగస్థల ఏక పాత్రలు రూపకల్పన చేశారు. ప్రభుత్వం, వివిధ కళాసంస్థలచే 24 బిరుదులు, వివిధ పురస్కారాలు పొందారు. స్వగ్రామంలో నిరుపేదలకు సొంత ఖర్చులతో ప్రతి నెలా ఆర్థిక సహాయం చేసేవారు. వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల పరీక్షలు చేయించేవారు. ఈయన చేసిన సేవలకుగాను సుమారు 140 వరకూ సన్మానాలు పొందారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనడమే కాకుండా ఈయన రాసిన 62 పుస్తకాల్లో నాలుగింటిని గ్రంథాలయాలకు ఎంపిక చేశారు. ఈయన సామాజిక, కళా రంగానికి చేసిన సేవలకుగాను ఆల్ ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వారు 2024 సంవత్సరానికిగాను జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు ఆయనను హైదరబాద్ సుందరయ్య కళానిలయంలో అకాడమీ అధ్యక్షులు మందడి కృష్ణారెడ్డి, జస్టిస్ జి.చంద్రయ్య, తెలంగాణ రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకరగౌడ్, కలెక్టర్ ఇ.వెంకటాచారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

సుందరయ్య కళా నిలయంలో సత్కారం అందుకుంటున్న సత్యనారాయణ

నేడు రైల్వే అధికారులతో కేంద్ర మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - భీమవరం

విజయవాడ డిఆర్ఎం కార్యాలయంలో గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పెండింగులో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, కొత్త రైళ్ల కేటాయింపు, కొత్తగా వందేభారత్ రైళ్లు, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నర్సాపురం-కోటిపల్లి రైల్వేలైన్ డబ్లింగ్ పనులపై సమీక్షించనున్నారు. భీమవరం, అత్తిలి, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు పట్టణాల్లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకునేలా చర్చలు జరపనున్నారు. కోవిడ్ తర్వాత ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న విషయంలో అన్ని రైళ్లు పునరుద్ధరణ, పొడిగింపు, వివిధ సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్రమంత్రి కార్యాలయం తెలిపింది.

యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

సిఐటియు ఆధ్వర్యాన ఎపిఎం, తహశీల్దార్ వినతి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని డ్వాక్రా యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు మండల కార్యదర్శి పి.గోవింద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎపిఎం రాజేష్‌కు, తహశీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యానిమేటర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు తోట పద్మావతి, ఎలిపే సుజాత మాట్లాడుతూ యానిమేటర్లపై రాజకీయ వేధింపులు సరికాదన్నారు. పద్ధతి మార్చుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు, వెలుగు, జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జిల్లాలో ఇటువంటి చర్యలకు పాల్పడొద్దని హైకోర్టు ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసిందని తెలిపారు. అనంతరం తహశీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యానిమేటర్లు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యానిమేటర్లు

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, ప్రతిరోజూ ఎన్నో జీవితాల్లో ఆరోగ్య దీపాలను వెలిగిస్తున్నారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ నగర్‌లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోటులను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అల్లూరి వెంకట రాఘవరాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డిటిడిసి బాబు సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే 380 రెయిన్ కోటు కిట్లను పారిశుధ్య కార్మికులకు సమకూర్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు నడిచే దేవుళ్లని కొనియాడారు. మన అందరి ఆరోగ్య బాధ్యతలు వారే మోస్తున్నారన్నారు. పరిశుభ్రతకు మనవంతు సహకారం అందిస్తేనే వారి కష్టాన్ని కొంతైనా తగ్గించగలిగిన వారమవుతామన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లోనే చెత్త ఉంచాలని, అలాగే ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలన్నారు. మన ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి వెంకట రాఘవరాజు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డిటిడిసి బాబు, గౌరవాధ్యక్షులు డాక్టర్ అల్లూరి వంశీకృష్ణ, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ప్రియాంక వర్మ, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు రెయిన్ కోట్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా తోడ్పాటు

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా తోడ్పడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం ఆదర్శ కాలనీలో ఏర్పాటుచేసిన అల్లూరి వెంకట రాఘవరాజు ఛారిటబుల్ ట్రస్ట్, సాకారాత్మ ఫౌండేషన్ సంకల్ప సమాధి యోగా ఆధ్యాత్మిక ఆరోగ్య సేవా సంస్థ, సిద్ధ ఆశ్రమం సంయుక్తంగా ప్రేమ్ నిరంతర గురూజీ నాన్న ఆధ్వర్యంలో సంకల్ప సమాధి యోగా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. యోగా అభ్యాసనపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అల్లూరి వెంకట రాఘవరాజు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా 21 రోజుల పాటు జరిగే సంకల్ప సిద్ధి ఉచిత యోగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అల్లూరి వెంకట రాఘవ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పివిఎస్ఎస్ఎన్.రాజు (డిటిడిసి బాబు)ను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఎంఎస్ సర్జికల్ ఆంకాలజి, ట్రస్ట్ మెంబర్ డాక్టర్ అల్లూరి వంశీకృష్ణ, డెర్మటాలజీ ఎమ్‌డి, ట్రస్ట్ మెంబర్ డాక్టర్ ప్రియాంక వర్మ జిల్లా ప్రజలకు సేవ చేసే లక్ష్యంతో త్వరలో భీమవరంలో ప్రాక్టీస్ పెట్టాలనే ఉద్దేశంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రేమ్ నిరంతర గురూజీ డాక్టర్ నాన్న, అల్లూరి వెంకట రాఘవ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డిటిడిసి బాబు, ట్రస్ట్ మెంబర్ డాక్టర్ అల్లూరి వంశీకృష్ణ, డాక్టర్ ప్రియాంకవర్మ పాల్గొన్నారు.

ప్రజా రక్షకులుగా పోలీసులు

డిజిపి ద్వారకాతిరుమలరావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాష్ట్రంలో నేరాల నివారణకు, కేసుల దర్యాప్తులో అధునాతన పద్ధతులు అవలంబించడంతోపాటు ప్రజారక్షకులుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని డిజిపి ద్వారకాతిరుమలరావు అన్నారు. నగరంలోని ఏలూరు రేంజ్ పోలీసు కార్యాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. తొలుత ఆయనకు రేంజ్ ఐజి అశోక్‌కుమార్‌తోపాటు రేంజ్ పరిధిలోని ఎస్‌పిలు స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌పిలతో నేర సమీక్షా సమావేశం డిజిపి నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేంజ్ పరిధిలో నేరాలపై సమీక్షించామని తెలిపారు. నేరాల నివారణకు తీసుకుంటున్న చర్యలతోపాటు హత్యలు, అత్యాచారాలు, మైనర్లపై అఘాయిత్యాలు, ఆస్తుల వివాదాలు, గంజాయి కేసులు వంటి వాటి దర్యాప్తు, శాఖలో డ్రోన్ల వినియోగం తదితర అంశాలపై చర్చించామన్నారు. విజయవాడ, విశాఖపట్నంలో సైబర్ సెల్ పోలీసు స్టేషన్లు ఉన్నాయని, వీటిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు రంగం సిద్ధం చేశామని చెప్పారు. సైబర్ నేరాల్లో ప్రస్తుతం పోగొట్టుకున్న సొమ్ము వెనక్కి వెనక్కి తీసుకొచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నివారణకు జిల్లాకు ఒక నార్కోటిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నామన్నారు. పోలీస్ క్యాంటీన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజి జి.అశోక్‌కుమార్, ఎస్‌పిలు ప్రతాప్ శివకిషోర్(ఏలూరు), అద్నాన్ నయూం అస్మీ(పశ్చిమగోదావరి), నరసింహారావు (తూర్పుగోదావరి), ఆర్.గంగాధర్‌రావు (కృష్ణా), విక్రాంత్ పాటిల్ (కాకినాడ), బొడ్డేపల్లి కృష్ణారావు (అంబేద్కర్ కోనసీమ), అధికారులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న డిజిపి ద్వారకాతిరుమలరావు

ఓజోన్ పొరపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

అంతర్జాతీయ ఓజోన్ పొర రక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక డిగ్రీ కాలేజీలో ఓజోన్ పొర రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎన్‌విఎన్‌బి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఓజోన్ పొర పర్యావరణ పరిరక్షణతో పాటు మానవులకు ఆరోగ్య రక్షణలో పోషిస్తున్న పాత్ర ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సిహెచ్ చైతన్య, కెవి.గణేశ్‌కుమార్, ఎం.అన్సారీ, షేక్ పర్విన్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

ఉండి పాములపర్రు పంట కాలువ పూడికతీత సందర్భంగా కాలువను ఆనుకుని ఉన్న సీతారాంపేటకు చెందిన డ్రెయినేజీ పగిలిపోయి కాలువలోకి మురుగునీరు రావడంతో సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ ఆధ్వర్యంలో చేపట్టిన మరమ్మతు పనులను ఎంపిడిఒ ఎస్.రవీంద్ర, మండల విస్తరణాధికారి ఎం.రామకృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల నుంచి పాములపర్రు గ్రామస్తులు స్వచ్ఛమైన తాగునీటి కోసం పోరాడుతున్న విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు వెంటనే వారి సమస్యను పరిష్కరించేందుకు ఆక్రమణలను తొలగించి కాలువ పూడికతీత పనులను దాతల సహకారంతో నిర్వహించారు. ఈ సమయంలో డ్రెయినేజీ పగిలి మురుగునీరు వస్తుందనే విషయాన్ని గమనించిన సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ వెంటనే స్పందించి డ్రెయినేజీ మరమ్మతు పనులు ప్రారంభించడం అభినందనీయమన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు : తహశీల్దార్

ప్రజాశక్తి - నరసాపురం

మాట్లాడుతున్న తహశీల్దార్ తలారి రాజరాజేశ్వరి

చట్టాన్ని అతిక్రమించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపై అయినా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తలారి రాజరాజేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్‌తో కలిసి తహశీల్దార్ శాంతి సమావేశం నిర్వహించారు. ఇటీవల మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా వివిధ సామాజిక తరగతుల మధ్య ఘర్షణ జరిగి రాళ్ల దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో ఇరు సామాజిక తరగతుల వారికి గాయాలయ్యాయి. అప్పటి నుంచి గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. గ్రామంలోని ఓ సామాజిక తరగతికి చెందిన 20 మంది పెద్దలను పిలిచి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి దాడులకు పాల్పడితే సహించేది లేదని తహశీల్దార్, మండల మేజిస్ట్రేట్ హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ యశోద, విఆర్ఒ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంటలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ముగ్గుతో స్వాగతం పలుకుతున్న అంగన్‌వాడీలు

గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా పండంటి బిడ్డకు జన్మనిస్తారని సర్పంచి కోట సరోజినీ అన్నారు. బుధవారం ఆచంట పంచాయతీ కార్యాలయం వద్ద పౌష్టికాహార మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరోజినీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించొచ్చన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికాకుండా ఉంటారన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్యామలాంబ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన వంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జివి.నరసింహారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు వైట్ల ఉషారాణి, గుత్తుల శ్రీదేవి, సత్యవతి, మంగలక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరు : పిల్లలను విద్యావంతులను చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ బి.ఊర్మిళ సూచించారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం మిషన్ వాత్సల్య లబ్ధిదారులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహక నిధులతో పిల్లలను చదివించాలని వారి పరిరక్షకులు, కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలిసిపిఒ విజయ సత్యవతి, కౌన్సిలర్ సత్యనారాయణ, ఒఆర్‌డబ్ల్యు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగొండ : పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఐసిడిఎస్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం పెనుగొండ పరిధిలో జలంచెరువు రామాలయం వద్ద గర్భిణులు, కిశోర బాలికలకు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశాలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి : జెసి

కాళ్ల: పెదఅమిరంలో బౌండరీ కోడ్ మురుగు కాలువలో ఉన్న ఆక్రమణలను రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులు సమన్వయంతో తొలగించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పెదఅమిరంలో బౌండరీ కోడ్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. మురుగు కాలువలో ఉన్న అక్రమ కట్టడాలను పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. ఆయన వెంట డ్రెయినేజీ ఎఇ జయప్రకాష్, ఇరిగేషన్ ఎఇ ఫణికుమార్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగార్జున, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రరావు మృతి తీరనిలోటు

ఆచంట: కోస్తా సమయం దినపత్రిక సంపాదకులు పడాల వీరభద్ర రావు అభ్యుదయ భావాలతో ఆదర్శ సమాజ నిర్మాణానికి అహర్నిశలూ కృషి చేశారని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడి సూర్యభాస్కర్‌రావు అన్నారు. పడాల వీరభద్రరావు అకాల మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. బుధవారం వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆయన మరణం తెలుగు వార్తా పత్రికారంగానికి, తెలుగు సమాజానికి తీరని లోటు అని అన్నారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధం : తహశీల్దార్

ఆకివీడు: ఖరీఫ్ ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం అవుతోందని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ మండల స్థాయి అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రైతు సహాయ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి, ప్రియాంక అగ్రికల్చర్ సొసైటీల అధికారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలన్నారు.. కార్యక్రమంలో తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి కమిటీలు, విఆర్ఒ, అగ్రికల్చర్ డిజిటల్ అసిస్టెంట్ సమన్వయంతో కలిసి పని చేస్తారని చెప్పారు. సమావేశంలో ఎఒ అధికారులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 16 మంది ఎంపిక

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పిజి కళాశాలలో వికాస కాకినాడ వారి సహకారంతో బుధవారం ఐసాన్, ఇంజి, డిఎస్‌సి, ఇండో ఎంఐఎం, హుందాయిమొబీస్, రిప్యుటేటెడ్ ఫార్మా కంపెనీలకు ప్రాంగణం ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికలకు 68 మంది అభ్యర్థులు హాజరవ్వగా 16 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరికి నెల జీతం 18,000 ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఇన్‌ఛార్జి యు.జానకిరామయ్య, టి.మీనా పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో యువకుడు గల్లంతు

నేరాలు - ఘోరాలు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెంబీచ్‌లో యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరంలోని మెంటేవారితోటకు చెందిన గంధం ప్రవీణ్ కుమార్ (17) తన ఏడుగురు మిత్రులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు బుధవారం వచ్చాడు. ఈ క్రమంలో స్నానం చేస్తుండగా సముద్ర కెరటాల్లో ప్రమాదవశాత్తూ లోపల కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

దాతల సాయం అభినందనీయం

ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మానవత్వంతో దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎంఎల్ఎ నివాసంలో విజయవాడ బాధితుల సహాయార్థం భీమవరం పాత ఇనుమ వ్యాపారస్తుల సంఘం సభ్యులు రూ.2,01,000 ఎంఎల్ఎ అంజిబాబుకు బుధవారం అందజేశారు. దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైందన్నారు. పాత ఇనుమ వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు బొమ్మిడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు జి.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ దువ్వా లోకేష్, సభ్యులు జి.నరసింహారావు, బొమ్మిడి ప్రసాద్, బోడపాటి సతీష్, బోడపాటి వినయ్, పి.కృష్ణ, ఎం.సత్యనారాయణమూర్తి, ఎస్.భాస్కర్ రాజు, వైదా సతీష్, మెరుగు శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, ఆకుల కృష్ణ, తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దూసనపూడిలో ప్రధానోపాధ్యాయునికి విరాళాలు అందజేస్తున్న విద్యార్థులు


ఎంఎల్ఎకు చెక్కు అందజేస్తున్న వ్యాపారులు

వీరవాసరం : వరద బాధితులను ఆదుకోవడంతో విద్యార్థులు సైతం తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. మేము సైతం అంటూ ముందుకొచ్చి విరాళాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తున్నారు. ఈ విధంగా సేకరించిన విరాళాలను తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు బుధవారం అందజేశారు. దూసనపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సేకరించిన రూ.7,358 నగదును ప్రధానోపాధ్యాయుడు వై.విజయకుమార్‌కు, రాయకుదురు మండల పరిషత్ కౌరువార వీధి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సేకరించిన రూ.4,145 నగదును ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ విరాళాలను సిఎం రిలీఫ్ ఫండ్‌కు పంపనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులకు కలిగిన ఈ సేవా ఆలోచనను ఉపాధ్యాయులు అభినందిస్తున్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై అవగాహన

ప్రజాశక్తి - ఉండి

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి సంధ్య

ఖరీఫ్ సీజన్ 2024కు సంబంధించి పంట కొనుగోలుపై గ్రామస్థాయి అధికారులకు మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కావడి నాగార్జున మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2024-25కు సంబంధించి సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్ ఎ రకం క్వింటాల్‌కు రూ.2,320 కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను అనుసరించి రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు సిబ్బంది ఐదు నాణ్యతా ప్రమాణ పరీక్షలు చేసి కొనుగోలు చేయాలన్నారు. వ్యర్థ పదార్థాలు, రంగు మారిన, కుచించుకుపోయిన, తక్కువ శ్రేణి గింజలు, తేమ పరీక్షలు నిర్వహించి నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడే విధంగా ధాన్యాన్ని మెరుగుపర్చి సిద్ధం చేసుకోవాలని వివరించారు. మండల వ్యవసాయాధికారి బి.సంధ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు రైతులే స్వయంగా గోనె సంచులు ఏర్పాటు చేసుకున్నట్లయితే ఒక సంచికి రూ.3.39, లేబర్ ఛార్జీలు హమాలీ ఛార్జీలు క్వింటాల్‌కు రూ.17.17, రవాణా ఛార్జీలు నిమిత్తం ఒక టన్ను ధాన్యానికి ఎనిమిది కిలోమీటర్ల లోపు దూరం ఉన్నట్లయితే 324 రూపాయలు ధాన్యం నగదుతో పాటు రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మోరంపూడి మహేష్, వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పెనుగొండ : రైతులకు కనీస మద్దతు ధర అందించాలని మండల వ్యవసాయాధికారి పి.స్పందన అన్నారు. బుధవారం రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రం ద్వారా ఖరీఫ్ సీజన్ 2024 - 25 ప్రొక్యూర్మెంట్ ధాన్యం ఈ దశలో ఉన్న కనీసం మద్దతు ధర రైతులకందించాలని, రైతు నష్టపోకూడదని, పారదర్శకత మద్దతు ధర ఇవ్వాలని గ్రామ వ్యవసాయ సంచాలకుల సమక్షంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనిత కుమారి పాల్గొన్నారు.

రాయలం గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ అంజిబాబు శంకుస్థాపన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాయలం గ్రామాన్ని మోడ్రన్ ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం నియోజకవర్గం రాయలంలో సుమారు రూ.60 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ అంజిబాబు శంకుస్థాపన చేశారు. ముందుగా రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, రూ.40 లక్షలతో మైక్రో ఫిల్టర్‌తో రెండు వాటర్ ట్యాంకుల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఐదేళ్లపాటు రాయలం గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి హయాంలోనే నెలరోజుల్లోనే అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని, రాయలంలోని శివారు ప్రాంతానికి కూడా మైక్రో ఫిల్టర్‌లతో శుద్ధి చేసిన నీటిని అందిస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ రాయలం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామన్నారు. ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్త వేయకూడదని అన్నారు. కార్యక్రమంలో రాయలం జనరల్ సెక్రటరీ పత్తి హరివర్ధన్, మాజీ సర్పంచి గుసిడి సూరిబాబు, రాయలం మాజీ సర్పంచి, ఇన్‌ఛార్జి కోళ్ల రామచంద్రరావు (అబ్బులు), చిలిమిల్లి గౌతమ్ నంద పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఎంపిపి చంటి రాజు

పాలకోడేరు : పారిశుధ్య నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని పాలకోడేరు మండల పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) అన్నారు. కుముదవల్లి గ్రామంలో సర్పంచి భూపతి రాజు వంశీకృష్ణంరాజు ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి గ్రామస్తులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. అలాగే తడి, పొడి చెత్త విభజన చేసుకొని పారిశుధ్య నిర్మూలనకు కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి చంటి రాజు, సర్పంచి వంశీకృష్ణమరాజు మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణకు బృహత్తరమైన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అప్పటివరకూ వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : గ్రామంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని సిహెచ్ అగ్రహారం గ్రామ సర్పంచి చుక్కా అప్పారావు అన్నారు. బుధవారం స్వచ్ఛతా హి పక్షోత్సవాల సందర్భంగా గ్రామంలో దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్ స్ప్రే యింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణుడు, ఎంపిహెచ్ఇఒ జి.వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకులు నామాలరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : పరిసరాల పరిశుభ్రత అనారోగ్యం దరిచేరదని పంచాయతీల విస్తరణాధికారి మేడిది నవీన్ కిరణ్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు నంబర్ వన్ పాఠశాల విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ఎఎన్ఎం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచి కోలాటి రాధ తెలిపారు. కాపవరం సర్పంచి కోలాటి రాధ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా 2వ రోజు పంచాయతీ శానిటరీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం చేసి, యుపి స్కూల్ విద్యార్థులకు భేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై, వ్యక్తిగత పరిశుభ్రతపై, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి కోలాటి రాధ, ఉపసర్పంచి అంగర వీరభద్ర కుమార్, వార్డు మెంబర్లు, పంచాయతీ సెక్రటరీ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉండి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల రోగాల నుంచి తమను తాము కాపాడుకోవచ్చని ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఉండిలోని పలు ప్రాంతాల్లో తమ విద్యార్థులతో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లా డుతూ పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని లేకపోతే దోమలు విజృంభించి వైరల్ జ్వరాల బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17వ తేదీ నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని పరిసరాలను శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుంచి యూనియన్ బ్యాంకు వరకూ ర్యాలీ నిర్వహించారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, డి.యన్.రావుపేట గ్రామానికి చెందిన మలిశెట్టి మధుబాబు అను నేను ఏలూరు జిల్లా, టి.నరసాపురం గ్రామం మరియు మండలంలో, బంధువుల ఇంటికి మోటారు సైకిల్ పై వెళ్ళు చుండగా టి.నరసాపురం గ్రామ సెంటర్ నందు నా **పాస్‌పోర్టు నెం: T7016384, వీసా నెం: P9900892,** అన్నియు పడిపోయినవి. నేను బంధువుల ఇంటికి వెళ్ళిన తరువాత చూసుకుంటే నా ఒరిజినల్ పాస్‌పోర్టు కనిపించలేదు. మార్గ మధ్యలో వెతికి చూసినా కనిపించలేదు. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకి తెలియ జేయగలరు.

మధుబాబు మలిశెట్టి
7-10/ బి2, డి.యన్.రావు పేట, రాఘవాపురం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా, పిన్: 534460. ఫోన్ నం: 94938 48450

ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినవి

ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, డి. యన్.రావు పేట గ్రామానికి చెందిన మలిశెట్టి మధుబాబు అను నేను ఏలూరు జిల్లా, టి.నరసాపురం గ్రామం మరియు మండలంలో, బంధువుల ఇంటికి మోటారు సైకిల్ పై వెళ్ళు చుండగా టి.నరసాపురం గ్రామ సెంటర్ నందు **10th క్లాస్, ఇంటర్ మీడియట్, డిగ్రీ మరియు యమ్.సి.ఎ.** అన్ని ఒరిజినల్స్ అన్నియు పడిపోయినవి. నేను బంధువుల ఇంటికి వెళ్ళిన తరువాత చూసుకుంటే నా ఒరిజినల్ సర్టిఫికెట్స్ కనిపించలేదు. మార్గ మధ్యలో వెతికి చూసినా కనిపించలేదు. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకి తెలియజేయగలరు.

మధుబాబు మలిశెట్టి
7-10/ బి2, డి.యన్.రావు పేట, రాఘవాపురం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా, పిన్: 534460. ఫోన్ నం: 94938 48450

నచ్చిన మిల్లులో ధాన్యం అమ్ముకోవచ్చు

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఖరీఫ్ ధాన్యం అమ్మకంలో రైతుకు నచ్చిన రైస్ మిల్లును ఎంపిక చేసుకునే అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సన్నద్ధతపై కమిటీ సభ్యులతో సమీక్షించి మాట్లాడారు. ఏ రైతూ తన పంటను కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. రైతు సహాయక కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా కూడా పనిచేస్తాయన్నారు. రైతు సమక్షంలో వారి గ్రామంలోనే రైతు సహాయక కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. ఈ కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. ఖరీఫ్ సీజన్ 2024-25కు గాను సాధారణ ధాన్యం రకానికి క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్ - ఎ ధాన్యం రకానికి ఒక క్వింటాల్‌కు రూ.2,320గా కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను రైతులు గమనించాలన్నారు. మట్టి, రాళ్లు, ఇసుక మొదలగు వ్యర్థ పదార్థాలు ఒక శాతం, గడ్డి, చెత్త, తప్పు, కలుపు విత్తనాలు ఒక శాతం, చెడిపోయిన, రంగుమారిన మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యపు గింజలు 5 శాతం, పరిపక్వంకాని, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యపు గింజలు 3 శాతం, ఏ గ్రేడ్ ధాన్యం కొనుగోలులో తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు లేక కేళీలు 6 శాతం, తేమ లేక నిమ్ము 17 శాతం అత్యధిక పరిమితి విధించడం జరిగిందన్నారు. అలాగే ఒక వేళ గింజలు రంగు మారకుండా ఉన్నట్లయితే చెడిపోయిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యపు గింజలు మొత్తం కలిపి 4 శాతం మించకూడదన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు త్వరితగతిన వారి ఖాతాలలో డబ్బులు నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాలో 384 రైతు సహాయక కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించినట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. తొలి విడతగా తాడేపల్లిగూడెం మండలంలో అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సూచించామన్నారు. ఇప్పటికే ఖరీఫ్ 2024-25 ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పలు స్థాయిల్లో పర్యవేక్షణ నిమిత్తం జిల్లా, డివిజనల్, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటుచేసి తగు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

మునిసిపల్ ఆఫీసు, పాలకొల్లు
ఆర్.ఓ.సి. నెం. 769/2015/ఇ1 ది.18-09-2024
ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘము పరిధిలో నందు పురపాలక సంఘ నిధులతో సంఘములోని 27వ వార్డులోని ఎఫ్‌సిఐ గొడౌన్ నుండి క్షత్రియ కళ్యాణ మండపం వరకు సి.సి. డ్రైను (Conservancy lane), 3వ వార్డులోని హెడ్ వాటర్ వర్క్స్ కొత్త వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ (11 ఎంఎల్‌డి) నందు 320 కెవిఏ డీజిల్ జనరేటర్ సప్లయ్, డెలివరీ మరియు installation, 9వ వార్డులో గల కైలాసవనంలో ఫౌంటెన్ ఏర్పాటు చేయు నిమిత్తం (3 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ. 47,80,000/-లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 19-09-2024వ తేదీ ఉదయం గం॥ 11.00 ని॥ల నుండి లభించును. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- బి.విజయ సారధి
మునిసిపల్ కమిషనరు, పాలకొల్లు

నరసాపురంలో అన్నదానం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 18వ వార్డు వనువులమ్మ ఆలయం వద్ద వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం బాల గణపతి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. బాల గణపతి కమిటీ సభ్యులు మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకట రమణను సత్కరించి, వినాయకుడి ప్రతిమ అందజేశారు.

నేడు ఉచిత షుగర్ క్యాంప్

ఉండి: ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ గురువారం ఉచితంగా నిర్వహించనున్న షుగర్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిన్ననాటి నుంచే మధుమేహ వ్యాధి ప్రతి ఒక్కరికీ వస్తోందని, తగు జాగ్రత్తల ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మధుమేహ వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించి కావాల్సిన వైద్య సదుపాయాలు అందించడమే కాకుండా ఉచితంగా మందులు అందించేందుకు ప్రముఖ వైద్యులు డాక్టర్ స్వామి బుధవారం స్థానిక కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో అందుబాటులో ఉంటారని వారు తెలిపారు.

మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు
ఓ.ఎస్.నెం. 77/2022

బిట్వీన్:
కోసూరి వెంకట సుబ్బారావు ...వాది
మరియు
నమ్‌గెడ్డా వేంకటేశ్వరరావు & నమ్‌గెడ్డా లీలా ...ప్రతివాదులు

టు: డి-5:
నమ్‌గెడ్డా మురళి, తండ్రి: లేటు నమ్‌గెడ్డా వేంకటేశ్వరరావు, R/o. డో.నెం.9-134, కుమ్మరి బజారు, సీతమ్మగారి హోటల్ లైన్, కెనాల్ ప్రక్కన, కైకలూరు గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.

పైన తెలిపిన దావా ప్రతివాది **డి-5** యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.15-10-2024వ తేదీ అయి ఉన్నది. కావున **వాయిదా రోజు ది.15-10-2024 ఉదయం గం॥10:30 ని॥లకు కోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను.** లేనిచో వారి పరోక్షములో దావా తీర్మానించబడును.

సింహాద్రి సుబ్బారావు
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
18-10-24. ఫోన్: 94416 53989

మహారాజశ్రీ 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), ఏలూరు వారి కోర్టులో
ఒ.ఎస్. నెం. 527/2023

మధ్య:
శ్రీ కనకల శేషుబాబు -వాది
మరియు
శ్రీ కాళ్ళ వీర వెంకట సత్య ఆది వరప్రసాద్ అలియాస్ ప్రసాద్ -ప్రతివాది

నోటీసు

ప్రతివాదినకు:
శ్రీ కాళ్ళ వీర వెంకట సత్య ఆది వరప్రసాద్ అలియాస్ ప్రసాద్, నివాసం: ఫ్లాట్ నెం. 101, డోరు నెం. 8-7-4/1, శ్రీ వినాయక హైట్స్, ఆర్.టి.సి. డిపో వెనుక, కూర్మయ్య పేట, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు వారు నోటీసును ఈ పత్రిక ద్వారా ఆర్డరు వేసినారు. కాబట్టి సదరు దావా వాయిదా రోజున అనగా ది. **29-10-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా హాజరై మీకేవైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షములో పై నెంబరు దావా తీర్మానిపబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

ఏలూరు **యం.జి.బి.మురళి,** అడ్వకేట్
తేది:12-09-24 ఏలూరు, సెల్: 6281943636

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 1వ అదనపు జూనియర సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 263/2023

బిట్వీన్:
అర్థాల యెస్తేరు రాణి ...వాది
మరియు
ముఖమట్ల మరియమ్మ ...ప్రతివాదులు

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన ముఖమట్ల మరియమ్మ, భర్త: రాఘవులు, డో.నెం. 5-1-22/1, పోలీసు స్టేషన్ వెనుక, గణపవరం అనే అడ్రసుకు ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ ఉద్దేశ్యపూర్వకంగా పుచ్చుకొనకుండా కాలయాపన చేయు చున్నందున, కోర్టు వారి ఆర్డరు ప్రకారం ప్రతివాది అయిన ముఖమట్ల మరియమ్మ, భర్త: రాఘవులు, డో.నెం. 5-1-22/1, గణపవరంకు తెలియజేయునది ఏమనగా.., పై నెంబరులో వాది గారు మీపై దావా వేసియున్నారనిన్ని, ఇందు మూలముగా మీకు తెలియచేయడమైనది. కనుక మీరు **ది. 24-09-2024న మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయతు కోర్టులో హాజరయ్యి ఆక్షేపణలు ఉన్నచో తెలియపర్చవలెను.** లేనిచో మీపై పరోక్షముగా తీర్పు చెప్పబడును.

తాడేపల్లిగూడెం, **బి.హెచ్.శేషు,** అడ్వకేట్,
18-10-24. తాడేపల్లిగూడెం.

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) / జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
ఓ.ఎస్.నెం. 125/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం. ...వాది
అండ్
ఆరేపల్లి లక్ష్మి అండ్ అనదర్ ...ప్రతివాది / ప్రతివాదులు
సమన్స్ టు:
డి-1: ఆరేపల్లి లక్ష్మి, భర్త: రామారావు, డో.నెం. 2-87, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
డి-2: వేముల సావిత్రి, భర్త: లక్ష్మణ్, డో.నెం. 4-115, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి / (జూనియర్ డివిజన్) / జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీరు తెలియజేయునది ఏమనగా **ది.04-10-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం
18-9-24. ఫోన్: 08814 274628